క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మరికల్: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డు విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం మండలంలోని విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవికాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10:30 నుంచి 12:30 వరకు రాయిచూర్ రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కేబుల్ మార్చడం జరుగుతుందన్నారు. ఇందుకు వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

మరికల్: రోడ్డు మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలని గ్రామస్తులు దామోదర్‌రెడ్డి, గణేష్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపుల ముళ్లచెట్లను తొలగించకుండా నాసిరకంతో పనులు చేస్తున్నట్లు వారు ఆరోపించారు. నిబంధనల ప్రకారం కంకర వేయకుండా గుంతల వద్దనే కంకర వేస్తు నాణ్యతకు తిలోదకలు పెడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లిలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో మొదటి బహుమతి గెలుపొందిన వారికి రూ. 12వేలు, ద్వితీయ బహుమతి రూ. 6వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహా, ముసిరాజు, కుమ్మరి సురేష్, బలరాం, రామాంజనేయులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

ఊట్కూరు: మండలంలోని పులిమామిడికి చెందిన అంజప్ప కూతురిని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరామర్శించారు. రెండు రోజుల కింద తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికెళ్లి చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తనవంతు సహకారం అందిస్తానని వైద్యులకు సూచించారు.

సాగునీటిని విడుదల చేయండి

నర్వ: మండలంలో యాసంగి సాగులో దాదాపు 10వేల ఎకరాలు సాగు చేసుకున్న రైతులకు సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు.. విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో ప్రధాన సాగునీటి రిజర్వాయర్‌లు సంగంబండ, భూత్పూర్ కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌ల నుంచి ఒక దఫా నీటిని విడుదల చేసి కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని బీఆర్ఎస్ మండల నాయకులు విజయ్‌కుమార్, శివన్న, జనార్దన్, రాజారెడ్డి, అశోక్ కోరారు.

ఆకట్టుకున్న బుర్రకథ ప్రదర్శన

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి పాఠశాలలో నో బ్యాగ్‌డే సందర్భంగా శనివారం విద్యార్థులు ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. బుర్రకథ పాత్రధారుల వేషాధారణలో విద్యార్థులు ఆహాభావాలు ప్రదర్శిస్తూ పాటలు పాడుతూ బుర్రకథను అలపించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటప్ప, సుజాత, సలాం, లియాకత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

ధన్వాడ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ ఎంపికైనట్లు మండల అధ్యక్షుడు మాకం సురేందర్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ మేరకు.. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తనకు జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందితకు నివాళి

నారాయణపేట: బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయ్ సాగర్, చెన్నారెడ్డి, గందెచంద్రకాంత్, సరాఫ్ నాగరాజు, ప్రతాప్‌రెడ్డి, బండి శివరాంరెడ్డి, గట్టురఘు, ప్రకాశ్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలపై అవగాహన

ధన్వాడ: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 18–60 సంవత్సరాలు కల్గిన ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సంక్రమించిన వారిపై వివక్షత చూపొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నాగజ్యోతి, సాయి, సింధూజ, నర్మద, వరలక్ష్మి, జ్యోతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలకు నిధులేవి?

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- ఏటా రావాల్సిన నిధులు రూ. 40 వేలు



మరికల్ మండల వనరుల కేంద్రం (ఫైల్)

మరికల్: మండల వనరుల కేంద్రాలను అడగే నాథుడు లేక వెల వెల బోతున్నాయి. వీటి నిర్వహణకు విద్యాశాఖ కేటాయిస్తున్న అరకొర నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదు. నిధుల కొరత కారణంగా పాఠశాల కాంప్లెక్స్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సమావేశాలకు మాత్రం కేటాయింపులు పెంచలేకపోతున్నారు. జిల్లాలో 11మండల వనరుల కేంద్రాలు ఉన్నాయి. వీటిని కేంద్రంగా చేసుకొని విద్యాధికారులు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తుండటమే కాకుండా విద్యాశాఖ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. వీటి నిర్వహణకోసం విద్యాశాఖ ఏటా రూ. లక్ష రూపాయలు అందజేసేది. ఈ నిధులను కార్యకలపాల నిర్వహణకు అయ్యే ఖర్చులకు వినియోగించేవారు. భవన నిర్వహణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు లేకపోతుండటంతో ఈ నిధులనే వాడేవారు. ఈ నేపథ్యంలో నిధులు సరిపోయేవి కాదు. ఇంకా నిధులు పెంచాలని భావిస్తున్న తరుణంలో ఉన్న నిధులకే కోత పెట్టింది. రూ. లక్షను రూ. 40 వేలకు తగ్గించింది. దీంతో నిర్వాహకులు భవన నిర్వహణను గాలికొదిలేశారు. పలుచోట్ల కిటికీలు ఊడాయి, బండలు దెబ్బతిని గుంతలు పడ్డాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయింది.

సమావేశాలకు సరిపోని నిధులు..

గతంలో డ్రాయింగ్ పవర్ ఎంఈవోలకే ఉండేది. అయితే ప్రస్తుతం విద్యాశాఖ ఈ అధికారాన్ని పాఠశాలల కాంప్లెక్స్ జీహెచ్‌ఎంలకు ఇచ్చింది. ఉపాధ్యాయుల జీత భత్యాల బిల్లులు, మెడికల్ బిల్లులు తదితర డ్రాయింగ్ ఆఫీసర్లే రూపొందించి నివేదించాల్సి వస్తుంది. దీంతో వచ్చే నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదని జీహెచ్‌ఎంలు వాపోతున్నారు. ప్రతి ఏటా పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలకు రూ. 22 వేలు ఇచ్చేవారు. ఈ సారి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు జరుగలేదు. కొన్ని పాఠశాలలకు నిధులే రాలేదు. దీంతో బిల్లుల రూపకల్పనకు ఆర్థిక పరమైన ఇబ్బందులు పడుతున్నారు. హోదా పెంచడమే కాకుండా నిధులను పెంచాలని డ్రాయింగ్ అధికారులుగా వ్యవహారిస్తున్న జీహెచ్‌ఎంలు కోరుతున్నారు.

> **నిధులు రావాల్సింది..**
>
> ప్రభుత్వం నుంచి ఎమ్మార్సీలకు నిధులు రావాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే పాఠశాల కాంప్లెక్స్, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం ఉంది.
>
> – అంజలిదేవి, ఇన్‌చార్జి ఎంఈఓ, మరికల్

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం..



మాట్లాడుతున్న వైద్యులు డా.కేశవ్

నర్వ: జాతీయ పల్స్‌పోలియోను సమిష్టిగా విజయవంతం చేద్దామని పీహెచ్‌సీ వైద్యులు డా. కేశవ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశంలో నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు.. ఈ కార్యక్రమం వచ్చేనెల 3నుంచి 5వరకు మూడురోజులపాటు నిర్వహిస్తారన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు రెండు చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సీహెచ్‌ఓ ప్రభాకర్‌జెట్టి, సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీలను పెంచాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దూరు: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ జయరాములు ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. శనివారం కొత్తపల్లి మండలంలోని ఎక్కమేడ్‌లోని ఎంపీడీఓ, ఎపీఓ సిద్దేశ్వర్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వీధిరోడ్లపై మురుగు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి జ్యోతికి అదేశించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



పేటలో ఇటుక బట్టీల తయారీపై వివరిస్తున్న హెచ్‌ఎం శేర్‌కృష్ణారెడ్డి

నారాయణపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలోని చివరి శనివారాన్ని నో బ్యాగ్ డేగా నిర్వహించడంలో భాగంగా శనివారం మండలంలోని ఎంపీపీఎస్ బసిరెడ్డిపల్లి విద్యార్థులను క్షేత్రస్థాయిలో వివిధ పనులపై పర్యటించి చూయించారు. ఇటుకల తయారీ, చెరువుల ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేర్‌కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగనూర్: విద్యార్థులు ప్రతి ఒక్కరూ తప్పకుండా పోషకాహారాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని జెడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు అన్నారు. చివరి శనివారాన్ని నో బ్యాగ్ డేగా నిర్వహించడంలో భాగంగా మండలంలోని విద్యార్థులకు ఫుడ్‌ఫెస్టివల్ తయారు చేసే విధానంపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మద్దూరు: ఆస్పత్రికి తరలించే లోపు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. మండలంలోని పల్లెర్లకు చెందిన అనితకు శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. అనంతరంలో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 అంబులెన్స్ టెక్నీషియన్ వెంకటేష్, కుటుంబ సభ్యుల సహకారంతో వైద్యం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వెంటనే మద్దూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు.

కున్సి వాసులకు జ్ఞాపికలు అందజేత

కృష్ణా: మండలంలోని కున్సిలో ఆలయ ప్రారంభోత్సవంతోపాటు విగ్రహా ప్రతిష్టాపనను గ్రామస్తులు విజయవంతం చేయడంపై వారికి శనివారం జైన మత గురువులు ప్రత్యేకంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ విజయరాజ్ తిలక్ సూరుజీ గ్రామానికి చెందినవారు కావడం వల్లే ఇక్కడ ఇంతటి ఆలయం నిర్మాణం జరిగిందన్నారు. అలాగే గ్రామంలో జీవహింస చేయకుండా అహింసా మార్గంలో జైన ధర్మం ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామచందర్, సిద్ధప్ప, రాజప్పగౌడ్, సోమశేఖర్‌గౌడ్, అంజప్పగౌడ్ పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ మండల అధ్యక్షుడి ఎన్నిక

దామరగిద్ద: మండల వీరశైవ లింగాయత్ సంఘం మండల అధ్యక్షుడిగా దామరగిద్దకు చెందిన కోడ్లి సతీష్ గౌరవ అధ్యక్షుడిగా సిద్ధిలింగప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని కంసాన్‌పల్లిలో చంద్రమౌళేశ్వరి ఆలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, కో–షాధికారిగా ఆవుటి బస్వరాజ్ ఎన్నికై య్యారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు శివకుమార్, అధ్యక్షుడు కొండావీరన్న, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, మల్లికార్జున్, బస్వంత్‌రాజ్, రాచప్ప, కోడ్లి శరణప్ప పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



మక్తల్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు



మాగనూర్‌లో..

నారాయణపేట: మండలంలోని కోటకొండ ఎంపీపీఎస్‌లో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం నసీరుద్దీన్, ఖాద్రి, తిరుపతి నాయక్, చంద్రిక, రమాదేవి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, హెచ్‌ఎంగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని పర్మన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈమేరకు.. హెచ్‌ఎం హుస్సేన్ మాట్లాడుతూ.. ఉన్నత విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పార్వతిపాల్గొన్నారు.

కోస్గి: మండల పరిధిలోని నాచారం ప్రాథమికొన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల తరపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం



నారాయణపేట: పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్‌సాగర్ ఆధ్వర్యంలో శనివారం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన లింగయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గందె చంద్రకాంత్, సరాఫ్ నాగరాజు, బండి శివరాంరెడ్డి, సుభాష్, చెన్నారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట: స్థానిక బాపునగర్ శ్రీ చౌడేశ్వరి ఆలయంలో శనివారం మాఘపూర్ణిమ ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, మంగళహారతి, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకల రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఎల్‌బీనగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుల పూజ, తదితర కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కృష్ణయ్యగౌడ్, నర్సింహారాజుగౌడ్, వెంకటప్ప, రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

మరికల్: మండల కేంద్రంలోని దత్తత్రేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది దత్తత్రేయ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా జాతర మహోత్సవాలు

నర్వ: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం శంకర లింగ శరణగురు జాతర మహోత్సావాలు రాంపూర్ శివారులో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా కళశపూజ, రుద్రాభిషేకం, పల్లకి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 25న గిరిజన కల్యాణం, సాయంత్రం గురుపూజ నిర్వహిస్తారన్నారు. ఈ ఉత్సవాల్లో బండలాగుడు పోటీలను ఎస్ఐ కురుమయ్య, దాతలు ప్రారంభించారు. బండలాగుడు పోటీలలో ఎద్దుల బలప్రదర్శనను తిలకించేందుకు ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అలాగే ప్రయాణంలో తమ వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని ఏఎస్ఐ సురేంద్రబాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లోని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు ప్రయాణికులు పాల్గొన్నారు.

వేడుకగా 'తల్లిదండ్రులకు పాదపూజ'



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

కోస్గి: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం 'తల్లిదండ్రులకు పాదపూజ' కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్య నేర్పే గురువులు దైవంతో సమానమనే భావన విద్యార్థుల్లో కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పాఠశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కో –ఆర్డినేటర్ మధుసూదన్, ప్రిన్సిపల్ రమేష్‌కుమార్, డీన్ వినయ్ కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జి మనిషా తదితరులు పాల్గొన్నారు.

శాంతికుమార్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలి

నారాయణపేట: పాలమూరు పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ ఎంపీ టికెట్‌ను శాంతికుమార్‌కు ఆ పార్టీ అధిష్ఠానం కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. పాలమూరు పార్లమెంట్ పరిధిలో 60శాతం బీసీ ఓటర్లు ఉన్నారని, బీసీ అభ్యర్థికి ఎంపి టికెట్ ఇస్తే గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో బీసీ నాయకులు రాములు, బాలరాజ్ యాదవ్, వెంకట్ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా నృసింహుడి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మరికల్: ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో కనుల పండువగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి దాసంగల రూపంలో నైవేద్యాలను సమర్పించారు. అనంతరం రథోత్సవం నిర్వహించిన తర్వాత ఎక్లాస్‌పూర్ నుంచి మరికల్‌కు వరకు స్వామివారి విగ్రహాల ఊరేగింపుగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



దామరగిద్దలో ఊరేగింపులో శివస్వాములు



మరికల్‌లో..

దామరగిద్ద: మండలంలోని శివస్వాములు మహాపడిపూజ కార్యక్రమం శివనామ స్మరణతో మార్మోగింది. శనివారం పౌర్ణమి సందర్భంగా స్థానిక శివాలయంలో మహాపూడి పూజ నిర్వహించారు. అంతకు ముందు మాలధారణ చేపట్టిన శివస్వాములు స్వామివారి చిత్రపటం, నంది, కళశ ఊరేగింపుతో స్థానిక గ్రామ పంచాయతీ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అభిషేక, అర్చన, ప్రత్యేక భజనలు చేపట్టారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన స్వాములకు అన్నదానం నిర్వహించారు. స్థానిక నాయకులు గురుస్వాములు కత్తి, కన్యస్వాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాశివ పడిపూజ

మరికల్: మండల శివస్వాముల ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో మహాశివ పడిపూజ నిర్వహించారు. ఈ మేరకు.. స్వామివారి చిత్రపటాలతోపాటు మెట్లపడిని అలంకరించారు. అనంతరం గురుస్వామి జగదీష్ మహాపడి పూజ నిర్వహించారు. అంతకుముందు కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి పూజకార్యక్రమాలను ప్రారంభించారు. స్వాములకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో శనివారం శివనామస్మరణ గ్రామ వీధులో మార్మోగింది. ఈ సందర్భంగా శివమాల ధారులు మెట్లపూజ, కళసపూజ, మహా మంగళ హారతిని నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నేరడగం మఠం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగా మహాస్వామి భక్తులకు సందేశాలను అందించారు. లింగ హోన్నయ్యతాతతో పాటూ గ్రామ భక్తులు పాల్గొన్నారు.

నర్వ: శివస్వాముల పడిపూజలు మండలంలోని పెద్దకడ్మూర్, ఉండేకోడ్, జక్కన్నపల్లి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల స్థానిక శివాలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకం, మెట్లపూజ కార్యక్రమాలను అర్చకులు, గురుస్వాములు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ మధుసూదన్‌రెడ్డి దంపతులు, గ్రామస్తులు అర్చకులు ప్రవీణ్‌కుమార్, తంబలి నర్సింహాయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్లను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాగనూర్: రాజీవ్ విద్యా పురస్కరం మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్, కృష్ణా మండలాలోని పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారిని గుర్తించి రాజీవ్ విద్యా పురస్కారం పేరిట రూ. 2 లక్షల 116 లక్కీ డిప్ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నర్సింహారెడ్డి, వాకిటి శ్రీనివాసులు, ఉజ్జెల్లి కృష్ణయ్య, వేణుగోపాల్, ఆంజనేయులు, నరేష్, వేణుగౌడ్, రాము పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్, గుడెబల్లూర్, కృష్ణా ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శనివారం ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అఫ్రోజ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు వలిషేక్, వేణుగౌడ్, షేక్ సర్వరాజ్, అసీఫ్, నాగేష్, శివ, పల్లె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పనులు ప్రారంభించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ. 3లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శివరాంరెడ్డి, రాఘవరెడ్డి, రవీందర్, నర్సింహులు, నర్సింహారెడ్డి, రాములు, యాకుబ్‌అలీ, గణేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



మక్తల్‌లో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

మక్తల్: రోడ్డుపై వాహనాలు నడిపించే సమయంలో ఆటో, ద్విచక్ర, ట్యాక్స్ ఇతర వాహనదారులు విధిగా రోడ్డుభద్రత నిబంధనలు పాటించాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లను రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు యునిఫాం ధరించాలన్నారు. ఆయనతో పాటు హెడ్‌కానిస్టేబుల్ లాల్‌సింగ్ సిబ్బంది అశోక్ తదితరులు ఉన్నారు.

మాగనూర్: రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఏఎస్ఐ మన్నన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫామ్ విధిగా ధరించాలని, ప్రతి వాహనదారుడు సరియైన ధృవపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ అర్జున్, రాజేఖర్, ఖాజా పాల్గొన్నారు.

దామరగిద్ద: రోడ్డు వాహనాలు నడిపించే సమయంలో ఆటో, ద్విచక్ర, ట్యాక్స్ ఇతర వాహనదారులు విధిగా రోడ్డుభద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ వసంత అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటోడ్రైవర్లను రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు యునిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.